క్లుప్తంగా

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పార్కులో మొక్కలు నాటుతామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా 300 మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. బ్యూటిఫికేషన్‌కు ఉపయోగపడే ఎడ్జ్ ప్లాంట్స్, ఫ్లవర్ ప్లాంట్స్, ఆక్సిజన్ మొక్కలు నాటుతామన్నారు. వాకర్స్‌తోపాటు క్లబ్ సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం రైతుబాజార్ సమీపంలోని ఓ షాపు వద్ద సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయసు గల ఓ వ్యక్తి మంగళవారం ఉదయం మృతిచెంది ఉండటాన్ని షాపు యజమాని గమనించి, ఆ ప్రాంతంలోని సచివాలయం మహిళా పోలీస్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆమె ఘటనా స్థలానికి చేరుకుని అక్కడ నుంచి ఐదో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, చుట్టుపక్కల ప్రజలను ఆరా తీశారు. మృతుడు రైతుబజార్ వద్ద బిక్షాటన చేస్తుంటాడని, ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళ ఎక్కడ పడితే అక్కడే నిద్రపోతుంటాడని తెలిపారు. అతడి ఎత్తు 5 అంగుళాలు, చింతపిక్క రంగు ప్యాంట్ ధరించి, తలకింద గళ్ల చొక్కా పెట్టుకుని ఉన్నాడు. మహిళా పోలీస్ పుష్పలత ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సతీష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

బీజేపీకి రానున్నది గడ్డుకాలమే..



శిబిరంలో పాల్గొన్న నాయకులు

అగనంపూడి: దేశంలో బీజేపీకి రానున్నది గడ్డు కాలమే అని, వారి పాలనకు రానున్న రోజుల్లో నూకలు చెల్లినట్టే అని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 1209వ రోజు, మంగళవారం వారు మాట్లాడారు. తిరుగులేని అధికారంతో విర్రవీగిన బీజేపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి లాభాల బాటలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి, నాశనం చేయాలని చూశారన్నారు. వారికి దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇప్పటికైనా బీజేపీ, ఎన్‌డీఏ పక్షాలు కళ్లు తెరిచి స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోకపోతే పుట్టగతులు ఉండవన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.శ్రీనివాసరావు, ఎంఎంఎస్ఎం, ఎస్టీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

6,7 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్ల మూసివేత

ఉక్కునగరం: ఏపీఎస్ఆర్టీసీ స్టీల్‌సిటీ డిపోలో ఈ నెల 6,7 తేదీల్లో బస్ పాస్ కౌంటర్లు మూసివేస్తున్నామని డిపో మేనేజర్ చటర్జీ తెలిపారు. బస్‌పాస్ జారీ సాఫ్ట్‌వేర్‌లలో మార్పు చేస్తున్నందున ఆ రెండ్రోజులు కౌంటర్లు పని చేయవన్నారు. 8వ తేదీ నుంచి యథావిధిగా కౌంటర్లు తెరుస్తామని, బస్‌పాస్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.
సింహాచలం: ఆర్టీసీ బస్‌పాస్‌లు జారీ చేసే అప్లికేషన్‌ను ఆధునికీకరిస్తున్న కారణంగా సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న బస్‌పాస్ కౌంటర్‌కు ఈనెల 6,7తేదీల్లో సెలవు ప్రకటించినట్టు డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. బస్‌పాస్ హోల్డర్స్ అందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

విష్ణుకుమార్‌రాజుదే విజయం

- 'ఉత్తర' ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి విజయకేతనం
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థిపై 47,534 ఓట్ల మెజారిటీతో గెలుపు
- మూడో స్థానంలో స్వతంత్ర అభ్యర్థి



ఏయూ కౌంటింగ్ కేంద్రంలో ఉత్తర నియోజకవర్గ ఓట్లు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది



ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు పి.విష్ణుకుమార్‌రాజుకు ధ్రువపత్రం అందిస్తున్న ఆర్వో అఖిల

సీతంపేట: విశాఖ ఉత్తర నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి పెనుమత్స విష్ణుకుమార్ రాజుకు పట్టం కట్టారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ, బీజేపీ అభ్యర్థుల మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో విష్ణుకుమార్‌రాజునే విజయం వరించింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కె.కె.రాజు, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజుల మధ్య ఉత్కంఠ పోరు సాగింది. 21 రౌండ్లలో(పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి) జరిగిన ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు విష్ణుకుమార్‌రాజు ఆధిక్యం కనబర్చారు. చివరకు పోస్టల్ బ్యాలెట్‌లో సైతం ఆధిక్యం సంపాదించారు. చివరకు తన ప్రత్యర్థి కె.కె.రాజుపై 47,534 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఉత్తర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో) డి.అఖిల మంగళవారం సాయంత్రం విష్ణుకుమార్‌రాజును విజేతగా ప్రకటించి ధ్రువీకరణ పత్రం అందజేశారు.

అభ్యర్థులకు పోలైన ఓట్ల వివరాలు

ఉత్తర నియోజకవర్గంలో మొత్తం 1,84,703 ఓట్లు పోలవ్వగా.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కె.కె.రాజుకు 61,267 (32.55%) ఓట్లు రాగా.. కూటమి బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజుకు 1,08,801 (57.81%) ఓట్లు వచ్చాయి. దీంతో 47,534 ఓట్ల మెజారిటీ సాధించి గెలుపొందారు. మొత్తంగా ఉత్తర నుంచి 15 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. బీజేపీ, వైఎస్సార్‌సీపీ మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. స్వతంత్ర అభ్యర్థి వడ్డీ శిరీష 5,311 (2.82%) ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. మిగతా పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. నాలుగో స్థానంలో జైభారత్ పార్టీ నుంచి వి.వి.లక్ష్మీనారాయణ 5,160 (2.74%) ఓట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లక్కరాజు రామారావు 4,252 (2.26%) ఓట్లు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి పెద్దాడ కనక మహాలక్ష్మి 938 ఓట్లు, సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి గుంపుల శరత్‌బాబు 395, నవ భారత నిర్మాణ సేవ పార్టీ చింతాడ సూర్యం 231, స్వతంత్ర్య అభ్యర్థులు రోణంకి చలపతిరావు 176, యలమంచిలి సాహితి 113, బొడ్డు శ్రీనివాస్ 104, పి.జగదీష్ 87, చప్పా రామునాయుడు 85, బొర్రా రమేష్ 81, కోనేటి ఈశ్వర వీరభద్రాచారి 77 ఓట్లు సాధించారు.

- పోస్టల్ బ్యాలెట్ మొత్తం 3,212 ఓట్లలో కె.కె.రాజుకు 1,121 ఓట్లు, విష్ణుకుమార్‌రాజుకు 1,673 ఓట్లు, వి.వి.లక్ష్మీనారాయణకు 200 ఓట్లు, వడ్డీ శిరీషకు 89 ఓట్లు పడ్డాయి. స్వతంత్ర అభ్యర్థుల కంటే ఎక్కువగా నోటాకు 1,130 ఓట్లు పడటం విశేషం.

రౌండ్ల వారీగా ప్రధాన పార్టీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

రౌండ్	వైఎస్సార్‌సీపీ	బీజేపీ	బీజేపీ ఆధిక్యం
1	3,009	4,632	1,623
2	3,173	5,696	2,523
3	3,525	6,514	2,989
4	3,965	5,410	1,445
5	3,531	5,559	2,028
6	3,717	5,181	1,464
7	2,320	4,649	2,329
8	2,418	5,402	2,984
9	1,898	5,438	3,540
10	2,023	4,813	2,790
11	2,496	5,368	2,872
12	2,916	6,041	3,125
13	2,793	4,758	1,965
14	2,477	4,541	2,064
15	4,436	5,235	799
16	3,435	5,857	2,422
17	2,961	5,564	2,603
18	3,000	6,537	3,537
19	3,290	5,172	1,882
20	1,782	2,911	1,129
21	972	1,850	878

విష్ణుకుమార్‌రాజు గెలుపుతో సంబరాలు



కుటుంబ సభ్యులతో కలిసి సంబరాలు చేసుకుంటున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. విష్ణుకుమార్‌రాజుకు ఆయన భార్య సీత సుజాత స్వీట్ తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. మనవరాళ్లు, కుమారుడు, బంధువులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
బీజేపీ కార్యాలయంలో..: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. విష్ణుకుమార్‌రాజుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జనసేన పార్టీ నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్, భర్త మురళీ తో కలిసి వచ్చి ఆయనను కలిశారు. జనసేన నాయకుడు రఘు, కాపు నాయకుడు బాలాజీతోపాటు టీడీపీ నాయకులు బర్ల పద్మావతి, మజ్జి ఉమామేశ్వరరావు, ఇతర నాయకులు ఆయనను కలిసి విష్ చేశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ తనను గెలిపించిన ఉత్తర నియోజకవర్గ ప్రజలు, జనసేన, తెలుగుదేశం, బీజేపీల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. తాను కక్ష సాధింపు చర్యలు తీసుకోనని, నియోజకవర్గంలో రౌడీయిజం, గంజాయి లేకుండా చేస్తానని చెప్పారు.

- 24వ వార్డు నక్కవానిపాలెంలో టీడీపీ నాయకురాలు బర్ల పద్మావతి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు.

టీడీపీ సంబరాలు

మురళీనగర్: రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా 50వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఉత్తర నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు విజయం సాధించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్‌చేశారు.

ప్రజా తీర్పును శిరసా వహిస్తా..

- కార్యకర్తలు అధైర్య పడొద్దు.. అండగా ఉంటా
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



పార్టీ శ్రేణులతో సమావేశమైన కె.కె.రాజు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల్లో వెలువడిన ఫలితాలపై ప్రజా తీర్పును శిరసా వహిస్తానని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పార్టీ నాయకులు, శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ నాయకులు, శ్రేణులు, కార్యకర్తలెవరూ అధైర్య పడవద్దని, ప్రతి ఒక్కరికీ తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జరిగిన ఎన్నికల్లో తనవెంట ఉంటూ రేయింబవళ్లు కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తాను రుణపడి ఉంటానన్నారు. గెలుపోటములు సహజమని, ప్రజా తీర్పును గౌరవిస్తానని కె.కె.రాజు పేర్కొన్నారు.

చకచకా వాకర్స్ పార్క్ పనులు



మురళీనగర్ వాకర్స్ పార్క్



పార్కులో ఫినిషింగ్ పనులు చేస్తున్న కార్మికులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్క్‌లో చేపట్టిన ప్రాంగణం విస్తరణ పనులు పూర్తయ్యాయి. ఇక్కడి వేదిక ఎదురుగా ఉన్న ప్రాంగణం విస్తరణకు క్లబ్ ఆధ్వర్యంలో నెల రోజులుగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న 1,600 చదరపు అడుగుల ప్రాంగణాన్ని ఎక్కువ మంది కూర్చుని విశ్రాంతి తీసుకునే విధంగా, సమావేశాల్లో ఎక్కువ మంది పాల్గొనేలా విస్తరించాలని భావించారు. మరో 800 చదరపు అడుగుల స్థలాన్ని ప్రాంగణంగా రూపొందించి మొత్తం 2,400 చదరపు అడుగులుగా తీర్చిదిద్దారు. ఈ మేరకు మంగళవారం ఫినిషింగ్ పనులు చేశారు. బెంచీలు ఉన్న స్థలంలో కూడా టైల్స్ ఏర్పాటు చేస్తామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి చెప్పారు. దీంతోపాటు దాత సహకారంతో ప్రవేశ ద్వారం నుంచి పాత్‌వే అభివృద్ధికి త్వరలో పనులు చేపడతామన్నారు.

ఘనంగా దుర్గమాంబ మారువారం పండగ



దుర్గమాంబకు పూజలు చేస్తున్న అర్చకుడు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం వాసుల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి మారువారం జాతర శ్రీరామాసేవా సమాజం(యాదవ్) ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దుర్గానగర్‌లోని ఆలయంలో ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేల డ్యాన్స్‌లు నిర్వహించారు. తోటవీధిలో పుట్టబంగారం నుంచి అమ్మవారి ప్రధాన దేవాలయం వరకు అమ్మవారి ప్రధాన ఘటాన్ని జాతర వేడుకల్లో ఊరేగించారు. గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో వరప్రసాద్ తదితరులు

మురళీనగర్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు సహకరించాలని వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ కోరారు. స్పోర్ట్స్ పార్కు ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల ముగింపు సందర్భంగా మంగళవారం విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రు లు తమ అభిప్రాయాలను పిల్లలపై రుద్దకుండా వారికి ఇష్టాలను, ఆశయాలను గౌరవించాలని సూచించారు. గత నెల రోజులుగా పార్కులో చదరంగం, యోగా, చిత్రలేఖనం, నృత్యం, భగవద్గీత తదితర అంశాల్లో శిక్షణ పొంది విజేతలైన విద్యార్థులు, పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు ఆయన అందించారు. శిక్షకులు సనపల ఉమాపతి, ఎం.జయ, ఎం.లక్ష్మి, డి.ప్రశాంతి, డి.షీల, హేమలను సత్కరించి జ్ఞాపికలు అందజేశా రు. కార్యక్రమంలో పార్కు నిర్వహణ కమిటీ కార్యదర్శి పి.వి.సూర్యనారాయణరాజు, ఉపాధ్యక్షు లు పల్లా చంద్రమౌళి, కోశాధికారి మళ్ల రామకృష్ణ, ఉప కోశాధికారి కె.కె.సురేష్, కార్యవర్గ సభ్యులు పొందూరు సూర్యనారాయణ, రోణంకి నాగేశ్వరరావు, లంకా వెంకట సుధాకర్, వల్లభనేని వీర రాఘవయ్య పాల్గొన్నారు.

పోలీస్ దిగ్బంధంలో ఏయూ పరిసరాలు



మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరువలో పోలీసుల పికెట్



వాహన చోదకుడికి బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ చేస్తున్న పోలీసులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మంగళవారం పోలీసు దిగ్బంధంలోకి వెళ్లిపోయింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలను భద్రపరచడం, ఓట్ల లెక్కింపు ప్రక్రియ వంటివి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా సాగాయి. మంగళవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మూడో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి మద్దిలపాలేనికి వెళ్లే రహదారిని పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మద్దిలపాలెం కూడలి వద్ద, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఉదయం ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వచ్చిన పోలింగ్ ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే లోపలికి పంపారు. వారికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేశారు. ఆ తరువాతనే ఏజెంట్లను లోపలికి పంపారు. పోటీ చేసిన అభ్యర్థులను సైతం పోలీసులు తనిఖీలు చేశారు. అభ్యర్థి, కారు డ్రైవర్, ఒక సెక్యూరిటీని మాత్రమే లోపలికి అనుమతించారు. మంత్రి గుడివాడ, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణలను సైతం ఇదే విధంగా తనిఖీ చేసి పంపారు. నగరంలో ప్రతి వార్డులో ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసులు పికెటింగ్ నిర్వహించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, ముందు జాగ్రత్తగా బందోబస్తు నిర్వహించారు.

దుర్గమ్మకు పసుపు కుంకుమల సమర్పణ



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మవారు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి గ్రామ దేవత దుర్గమ్మ అమ్మవారి పండగ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం దొండపర్తి వాసులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి అల్లూరి సత్యనారాయణరెడ్డి, కారాల మహేష్ మాట్లాడుతూ ఈ నెల 10న పుట్ట బంగారం తీసుకు రావడంతో పాటు అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చి 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు వేడుకలను పర్యవేక్షించారు.

12 నుంచి 'మిషన్ లైఫ్'

- ఎకో క్లబ్స్ ద్వారా పాఠశాలల్లో పర్యావరణ చైతన్య కార్యక్రమాలు
- ఏపీఎన్‌జీసీ జిల్లా కో-ఆర్డినేటర్ ఖగేశ్వరరావు



అగనంపూడి: ఏపీ ఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రతీ పాఠశాలలో మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహించాలని ఏపీఎన్‌జీసీ అనకాపల్లి జిల్లా కో-ఆర్డినేటర్ శిష్ట్ల ఖగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్షా ఎస్‌పీడీ ఆదేశాలు, అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సూచనల మేరకు పాఠశాలల్లో ఎకో క్లబ్‌ల ద్వారా నిర్వహించాలని కోరారు. వీటిలో భాగంగా 5వ తేదీన ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, వస్తువులు వాడకుండా ఉండడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా ర్యాలీలు నిర్వహించడం, మొక్కలు నాటడం చేయాలని తెలిపారు.

ఇదీ షెడ్యూల్

- 12న నీటిని ఆదా చేయడం, పాఠశాలల్లోని పైప్‌లైన్ల లీకేజీలు అరికట్టడం, నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహించడం, నీటి సంరక్షణ అవగాహన ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు.
- 13వ తేదీన శక్తిని ఆదా చేయడం, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపు, ఎనర్జీ టీమ్‌లు, క్లబ్‌లు ఏర్పాటు చేయడం, పోస్టర్లు, బ్యానర్లు తయారు చేయాలన్నారు.
- 14వ తేదీన వ్యర్థాలను తగ్గించడం, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో శుభ్రత, వ్యర్థాలను వేరు చేయడం, తరగతి గదుల్లో డస్ట్‌బిన్‌లు వాడడం విద్యార్థులకు అలవాటు చేయడం, శానిటరీ వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువులు చేయడం, కమ్యూనిటీ సభ్యులతో ఇంటరాక్ట్ అవ్వడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.
- 15వ తేదీన ఈ వ్యర్థాలను తగ్గించడం, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో ఈ వ్యర్థాలను సేకరించడం, భూమిపై ఈ వ్యర్థాల ప్రభావంపై పిల్లలతో చర్చించడం చేయాలి.
- 18వ తేదీన స్థిరమైన ఆహార వ్యవస్థ, కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేయడం, వ్యర్థాలతో పర్యావరణ అనుకూల ఎరువులు, మొక్కల పెరుగుదల, పర్యావరణ ప్రయోజనాలపై చర్చించడం చేయాలని తెలియజేశారు.
- ఈ నెల 19న ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, నేచర్ వాక్, ప్లాంటేషన్ డ్రైవ్, పర్యావరణ శాస్త్రం, చరిత్ర, భౌగోళిక ఆచారాలు, సంప్రదాయాలను పరిశీలించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకొని ఉపాధ్యాయులు, విద్యార్థులను భాగస్వాములను చేయాలని ఆయన కోరారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం




నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠం పజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు పవన్‌కుమారాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం పూజలు, అభిషేకాలు విశేషంగా జరిగాయి. తెల్లవారు జామున 5గంటల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. స్వామి సన్నిధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వి.రాంబాబు, సిబ్బంది పర్యవేక్షించారు.